దోచుకెళ్తున్నారు.. జర జాగ్రత్త

సొంత ఊళ్లకు.. పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకుంటున్నారా? అయితే జాగ్రత్త. మీరు అలా వెళ్లగానే మీ ఇంట్లో దొంగలు పడే ప్రమాదం ఉంది. గతంలో వేసవిలో, రాత్రివేళ దొంగతనాలు జరిగేవి. కానీ ప్రస్తుతం సీజన్ ఏదైనా.. ఉదయం, రాత్రితో సంబంధం లేకుండా దొంగలు తమ వృత్తి కొనసాగిస్తున్నారు. నిర్మల్‌లో దొంగల బెడద రోజురోజుకు ఎక్కువవుతుంది. పక్కా ప్లాన్‌తో తాళం వేసిన ఇళ్లు, దుకాణాల్లో నగదు, విలువైన వస్తువులతోపాటు వాహనాలను కూడా ఎత్తుకెళ్తున్నారు. మార్కెట్, బస్టాండ్ తదితర రద్దీ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు దొంగలిస్తున్నారు. పెట్రోలింగ్ డ్యూటీలు పెంచడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని పట్టణవాసులు పేర్కొంటున్నారు. ప్రతీ స్టేషన్ పరిధిలోని రెడ్ జోన్ అనుమానిత ప్రాంతాల్లో బ్లూ కోర్ట్స్ సిబ్బంది ఉదయం, సాయంత్రం పెట్రోలింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం కేవలం ప్రధాన రహదారులపైనే దృష్టి సారిస్తున్నారు. ఇదే దొంగలకు అవకాశంగా మారుతుంది. పోలీసుల సంచారం ఉండని ప్రాంతంలో దొంగలు తమ పనిని సులువుగా కానిస్తున్నారు.

– నిర్మల్‌టౌన్



నిర్మల్‌లోని కావేరినగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం పోలీసులు (ఫైల్)

- నిర్మల్‌లో పక్కా ప్లాన్‌తో దొంగతనాలు
- తాళంవేసిన ఇళ్లు, రద్దీ ప్రాంతాలే లక్ష్యం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- అనుమానితులుంటే 100కు సమాచారం ఇవ్వాలని సూచన

పోలీసుల కళ్లు గప్పి..

నిఘా విభాగం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా దొంగలు పోలీసుల చేతికి చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారు. రాత్రి, పగలు పోలీసులు గస్తీ కాస్తున్నా.. వారి కళ్లు గప్పి మరీ దొంగలు తమ చేతికి పని చెబుతున్నారు. పోలీసులకు ఎటువంటి ఆనవాళ్లు దొరకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలా వరుస దొంగతనాలతో పోలీసులకు చెమటలు పడుతున్నాయి.

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- తాళం వేసి ఉన్న ఇంటికి రక్షణగా రక్త సంబంధీకులు, నమ్మకస్తుల్లో ఒకరిని ఉంచాలి.
- ఊరెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులను ఇంట్లో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదా తమ వెంట తీసుకెళ్లాలి.
- అపరిచితులను పనిమనుషులుగా నియమించుకోవద్దు.
- వేరే ఊరికి వెళ్లే ముందు దగ్గరలోని పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి.
- కాలనీల్లో అనుమానితులు, గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు ఫోన్ చేయాలి.
- ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్, సెంట్రల్ లాక్ సిస్టం అమర్చుకోవాలి.
- ఇంటి ఆవరణలోని సీసీ కెమెరాలను ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తుండాలి.
- అపార్ట్‌మెంట్ల దగ్గర నమ్మకమైన వాచ్‌మెన్‌లను నియమించుకోవాలి.
- ఇంటి ముందు చెత్త, దినపత్రిక, పాలప్యాకెట్లు జమ కానివ్వొద్దు.
- ప్రధాన ద్వారానికి తాళం వేసినా కనిపించకుండా పరదాలు వేయాలి.
- ఊరెళ్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదు.
- కాలనీల్లో స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు అందుబాటులో ఉండాలి.

కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



అపార్ట్‌మెంట్, ఇండిపెండెంట్ హౌస్‌లో ఉన్నవారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దూర ప్రాంతాలకు వెళ్లేవారు చుట్టుపక్కలవారితోపాటు, పోలీసులకు సమాచారమిస్తే ఇంటిపై నిఘా పెడతాం. ఎస్పీ ఆదేశాల మేరకు రాత్రి, పగలు గస్తీ కాస్తున్నాం. నగరాన్ని సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటికీ చాలా దొంగతనాల కేసులను రికవరీ చేశాం. నమోదైన కేసులను కూడా పరిష్కరిస్తాం.

– పురుషోత్తం, పట్టణ సీఐ

జరిగిన ఘటనలివీ..

- నిర్మల్‌లోని బాలాజీవాడ కాలనీకి చెందిన శశికళ కుమారుడు స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. గత నెల 29న గుర్తు తెలియని వ్యక్తి వారి ఇంటికొచ్చి మీ కుమారుడికి లాటరీ వచ్చిందని.. మిమ్మల్ని రమ్మంటున్నాడని బైక్‌పై తీసుకెళ్లాడు. మీ మెడల ఉన్న బంగారు పుస్తెలతాడును తీసి రావాలని.. లేదంటే లాటరీ ఇచ్చేవాళ్లు మిమ్మల్ని డబ్బున్నవాళ్లు అనుకుంటారని మాయమాటలు చెప్పాడు. దీంతో ఆమె తన పుస్తెలతాడును ఇంట్లో ఉన్న వాళ్ల అమ్మకిచ్చి బైక్‌పై వెళ్లింది. కొంత దూరం వెళ్లాక సదరు వ్యక్తి బైక్‌ను ఆపి మెకానిక్‌కు చూపించుకొస్తానని చెప్పి ఆమెను దించేశాడు. తిరిగి శశికళ ఇంటికొచ్చిన ఆ దొంగ మీ కూతురు పుస్తెలతాడు ఇవ్వమంటుందని చెప్పి తీసుకెళ్లాడు. ఇంటికొచ్చి జరిగిన విషయం తెలుసుకొన్న బాధితురాలు లబోదిబోమంది.
- ఇటీవల నిర్మల్‌రూరల్ మండలం తల్వేద గ్రామంలో కుటుంబంతో వేరే ఊరు వెళ్లిన ఓ వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. రాత్రి తాళం పగలగొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. మరుసటి రోజు ఉదయం వచ్చిన కుటుంబసభ్యులు చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో దొరికిన అరతులం బంగారు పుస్తెలను ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- గత డిసెంబర్ 24న ఆదివారం రద్దీగా ఉండటంతో మార్కెట్ ప్రాంతంలో ఎనిమిది మంది సెల్‌ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లారు.
- నిర్మల్ పట్టణంలో వారానికి రెండు నుంచి మూడు చొప్పున వాహనాల చోరీ జరుగుతున్నట్లు సమాచారం.
- గత డిసెంబర్‌లో హైదరాబాద్ నుంచి నిర్మల్ వచ్చిన ఓ ప్రైవేటు మహిళా డాక్టర్ బస్టాండ్‌లో ఆదిలాబాద్ బస్సు ఎక్కుతుండగా ఆమె బ్యాగులోంచి ఆరు తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

క్లుప్తంగా

'బీసీ కులగణన చేపట్టాలి'



మాట్లాడుతున్న రాజేశ్వర్

లక్ష్మణచాంద: రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కులగణనను వెంటనే చేపట్టాలని లక్ష్మణచాంద జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాజ్యాధికారం కోసం రాజకీయ పార్టీల్లోని బీసీ నాయకులు, విద్యావేత్తలు ఏకం కావాలని కోరారు. బీసీ కులగణన పూర్తయితే అన్ని రంగాల్లో బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



ఏర్పాటు చేయిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు

నిర్మల్‌టౌన్: వాహనాల వేగం నియంత్రించేందుకు జిల్లా కేంద్రంలోని బస్ డిపో ఎదుట రహదారిపై ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ వాహనాల వేగం తగ్గించేందుకు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం గమనించి వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. ఇందులో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

ఆలయాల్లో పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోచమ్మకు భక్తుల పూజలు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో ఉన్న పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సమీప ప్రాంతాలైన పీచర, పార్‌పెల్లి, రాచాపూర్, వడ్యాల్, లక్ష్మణచాంద, మల్లాపూర్, మునిపెల్లి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిచ్చి పూజలు చేశారు. అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని దేవిబాయి క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మందికిపైగా రక్తపోటు, మధుమేహం, గుండె, కీళ్ల సంబంధ సమస్యలు, కంటి సమస్యలు, చర్మవ్యాధులు, స్త్రీల వ్యాధులు, ఫిజియోథెరపీ విభాగాల్లో చికిత్స చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు అవినాశ్ మాట్లాడుతూ నిర్మల్ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, అత్యవసర సేవలు 24 గంటల పాటు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అవినాశ్, రామచంద్రారెడ్డి, రనీత్‌కుమార్, ప్రశాంత్, అమరేశ్వర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, చంద్రిక, కీర్తి ఉన్నారు.

గండి పోచమ్మకు పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కడెం: మండలంలోని రాంపూర్ సమీపంలో.. ఉట్నూర్–ఆదిలాబాద్ ప్రధాన రహదారి పక్కనే అడవిలో కొలువుదీరిన గండి పోచమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

కుంటాల: సమాజంలో ప్రజలకు అందించే సేవలతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంకూర్‌లో మాజీ సర్పంచ్ మగ్గిడి శృతిని సన్మానించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ చాకటి లస్మన్న, అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్, సభ్యులు. శ్రీరాములు, శీను తదితరులు ఉన్నారు.

నిర్మల్: దస్తురాబాద్ మండలం రేవోజీపేట, దస్తురాబాద్ గ్రామపంచాయతీల్లో ఇటీవల పదవీకాలం ముగిసిన పంచాయతీ పాలవర్గాలకు సన్మానం చేశారు. సర్పంచులు నిమ్మతోట రాజమణి, దీటి సుజాత, కుల, యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు శరత్‌రెడ్డి, పెద్దన్న, రాజన్న, శ్రీనివాస్, రాజేందర్, నాగన్న, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై సాయికుమార్

లోకేశ్వరం: వాహనాదారులు విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై సాయికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పంచగుడి గ్రామ వంతెన వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే నష్టాల గురించి వివరించారు. అంతకుముందు పలువురికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.

'ప్రజలను నిరాశపరిచిన బడ్జెట్'



బానావత్ గోవింద్

ఖానాపూర్: కేంద్రప్రభుత్వ బడ్జెట్ దేశ ప్రజలను నిరాశ పరిచిందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 10 ఏళ్లలో ప్రవేశపెట్టిన పథకాలకు నిధులు ఖర్చు చేయడంలో విఫలమైందన్నారు. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు న్యాయంగా రావాల్సిన నిధులను తగ్గించడం అన్యాయమన్నారు. 2022–23 బడ్జెట్‌లో పీ ఎంపీవీటీజీల అభివృద్ధి మిషన్ పేరిట కేంద్ర కేబినెట్ ఆమోదించిన రూ.15వేల కోట్లను షెడ్యూల్ తెగలకు కేటాయించలేదని పేర్కొన్నారు.

పాఠశాలకు సీసీ కెమెరా విరాళం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 2013–14లో పదో తరగతి పూర్తి చేసిన ఏఆర్ కానిస్టేబుల్ బర్కుంట కల్యాణ్ రూ.5 వేల విలువైన ఆదివారం పాఠశాల కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు కల్యాణ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ కార్యదర్శి షేర్ నరేందర్, ఉపాధ్యక్షుడు గుండొల్ల దత్తురాం, సహా కార్యదర్శి బర్కుంట నరేందర్, సుధాకర్, మురళి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

భైంసాటౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావుపటేల్ అన్నారు. పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఆదివారం పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ధాగాం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు చవాన్ బాపురావు పాటిల్, విశ్వనాథ్ పాటిల్, సాయినాథ్, మాధవ్‌రావు, నాగోరావుతోపాటు పలువురికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే హంపోలికి చెందిన సింధే ప్రసాద్ పటేల్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్‌రావు పటేల్, రాంచందర్‌రావు, శంకర్ చంద్రే తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారాయణ్‌రావు పటేల్

పరామర్శ

భైంసాటౌన్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్‌ను ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు భోస్లే నారాయణ్‌రావుపటేల్ ఆదివారం పరామర్శించారు. మల్లేశ్ తండ్రి నర్సయ్య ఇటీవల మృతి చెందారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని కొలిమికుంట గ్రామంలో వారి నివాసానికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. వారి వెంట ఆనంద్‌రావు సింధే, రాజేశ్వర్, శంకర్‌చంద్రే తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉపస్థితి దివస్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఉదాసి మఠంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉపస్థితి దివస్ నిర్వహించారు. దీనికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రశిక్షణ ప్రముఖ్ గోనెల శశిరాజ్ హాజరై మాట్లాడారు. సామాన్యుల్లో జాతీయతా భావాన్ని జాగృతం చేసే మహత్తర కార్యాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చేపడుతుందని తెలిపారు. అనంతరం యువకులకు యోగాసనాలు, వ్యాయామంపై ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోనెల శశిరాజ్

గురుకుల మోడల్ పరీక్ష

కుంటాల: ఈనెల 11న గురుకులాల్లో ఐదో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. కాగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు ఆదివారం నమూనా పరీక్ష నిర్వహించారు. ఇందులో మొదటిస్థానంలో సృజన విద్యా నిలయం, వాసర పాఠశాల విద్యార్థులు వినయ్, క్రాంతి.. ద్వితీయ స్థానంలో శాంతికేతన్ పాఠశాల విద్యార్థి యశస్ చంద్ర నిలిచారు. వీరికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు కొత్త కాపు గంగన్న, హరిప్రసాద్, సంతోష్, ప్రవీణ్‌కుమార్, గజానంద్, గజానన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంతంగా సీవోఈ సెట్

భైంసాటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సీవోఈ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ పరీక్ష కేంద్రంలో ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 360 మంది విద్యార్థులకు గాను 346 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు. వారికి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు.

ప్రమాణస్వీకారం చేసిన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం పట్టణ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. స్థానిక వాసవిమాత ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా రవీందర్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జితేందర్, రాజేశ్, బుచ్చన్న, విశ్వనాథం, ప్రభాకర్, సుదర్శన్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల అభివృద్ధి కమిటీ ఎన్నిక

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా నంది రామయ్య, ప్రధాన కార్యదర్శిగా బానావత్ గోవింద్, ఉపాధ్యక్షులుగా దాదాబాయి, రమేశ్, సురేశ్, రాజేశ్వర్, సహాయ కార్యదర్శులుగా షమీ, షాకీర్‌ఖాన్, వర్మ, అఖిల్, కోశాధికారిగా శ్రీకాంత్, తదితరులు ఎన్నికయ్యారు. సమావేశంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాలనీ కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ జర్నలిస్ట్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా పూదరి తిరుపతి, అధ్యక్షుడిగా భీమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భూసాని దేవేందర్‌వర్మ, కోశాధికారిగా భోజన్న, ఉపాధ్యక్షులుగా రాజువర్మ, వేణు, సంయుక్త కార్యదర్శిగా కిశోర్, సలహా సభ్యులుగా మదన్‌మోహన్, సురేశ్, శ్రీనివాస్, గంగయ్యను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

బాలాజీవాడ మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బాలాజీవాడ మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గంధం సుధాకర్, ఉపాధ్యక్షులుగా రాజు, కొప్పుల మురళీధర్, కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా ఆకుల కార్తీక్, కొప్పుల కరుణాకర్, కోశాధికారిగా రామయ్య, ప్రచార కార్యదర్శిగా ధన్‌రాజ్, ఆడిటర్లు, సలహా సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- కార్యకర్తలతో ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆ పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో నిర్వహించిన గావ్‌చలో, బస్తీచలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇంటింటికీ మరుగుదొడ్డి, ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్లతోపాటు పేదలకు రేషన్ సరుకులు పంపిణీ చేసిందన్నారు. కార్యకర్తలు పాఠశాలల్లోని సమస్యలను, గ్రామాల్లోని సమస్యలను గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్‌రావ్, చక్రధర్‌పటేల్, యాతలం చిన్నారెడ్డి, బాలాజీపటేల్, నారాయణ్, మారుతి, లక్ష్మణ్‌రెడ్డి, ఎల్లప్ప, రాజు, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

తానూరు: సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వర్తించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ముధోల్ సీఐ మల్లేశ్ అన్నారు. ఆది వారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను ఎస్సై సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశా రు. సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అంతకుముందు సీఐకి పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.



తానూరులో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ మల్లేశ్

సీఐకి సన్మానం

ముధోల్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముధోల్ సీఐ మల్లేశ్‌ను ఆదివారం మండల కేంద్రానికి చెందిన యువకులు, పెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గడ్డం సుభాశ్, భోజన్న, సాయిలు, భూషణ్, సునీల్, శంకర్ సాయి, మహేశ్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

గుంతలతో ఇబ్బందులు

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండా నుంచి హథ్‌గాం వెళ్లే మార్గంలో పొలాల నుంచి వచ్చే నీటితో లక్ష్మీనగర్ వద్ద రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికా రులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేసి రోడ్డుపై నీరు నిల్వకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, ఫోన్ 95506 07360



ఆక్రమణలో 'హరిత' మొక్కలు



కంచరోని చెరువు కట్టపై పార్కింగ్ చేస్తున్న వాహనాలు

జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ సమీపంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కంచరోని చెరువును ఆనుకొని ఉన్న కట్టకు ఇరువైపుల హరితహారంలో భాగంగా మొక్కలు నాటి ఫెన్సింగ్ వేశారు. కానీ కొందరు సదరు స్థలాన్ని ఆక్రమించుకొని వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మరికొందరు నాటిన మొక్కలు, ఫెన్సింగ్ తొలగించి ఇసుక కుప్పలను డంప్ చేసి అక్రమ దందా కొనసాగిస్తున్నారు. అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఫెన్సింగ్ తొలగించి పోసిన ఇసుక కుప్పలు